# మా అబ్బాయి

౧

'ఆ అను అమ్మా, ఆ అను' అని మాఅబ్బాయిని చేతులలో ఇముడ్చుకొని, వాడు నోటిలో పెట్టుకొన్న మంటిబెడ్డను తీసివేయడానికి ప్రయత్నము చేస్తిని. నా యత్నము సాగనియ్యక, పిల్లవాడు ముఖము ఇటూ అటూ తిప్పుతున్నాడు. ఎలాగైతే నేమి, కష్టముమీద మంటిబెడ్డ బైటికి లాగినాను. మళ్లీ నేను పడకకుర్చీలో కూర్చుండి సగము చదివిననవలను చేతపట్టినాను. ఆడుకోడానికి ముందు పెట్టినలక్క పిడతలు ఇటూ అటూ విసురుతూ, పాకిపోయి మళ్ళీ తెస్తూ, నాకొడుకు ఆడుకొంటూ ఉన్నాడు.

నవల చదవడానికి ప్రారంభించాను. కథాసందర్భము ఎంతో బాగా ఉన్నది. నాయకుడు నాయికతో ఏమేమో తమాషామాటలు అంటున్నాడు. నాయిక ముఖము కిందికి వంచి సిగ్గు అభినయిస్తున్నది. ప్రేమ అంటే ఏమిటో, తాను ఏలాగున ఆమెను ప్రేమించినాడో, అమూల్యవస్తువులన్నింటిలోకీ తన ప్రేమ ఎంత అమూల్యమో నాయకుడు చెప్పుతున్నాడు. ఇంతలో ఒక

వీరుడు వచ్చి వారియెదుట నిలవబడినాడు. నాయికశరీ
రము వణికినది; నాయకుడు మాట్లాడ లేకపోయినాడు.
అంతట వీరుడు నాయికతో మృదుమధురవచనాలతో
ఈలా గన్నాడు......

ఈపట్టున వుండగా నాకొడుకు కెవ్వున కేక వేయ
డముచేత నాచేతిలో పుస్తకము జారవిడిచి, దిగ్గున లేచి
ఇటూ అటూ చూస్తిని. కుర్రవాడు నాగదిలో లేడు.
ఏమి జరిగిందో అని అడావడిగా నడవలోకి వెళ్ళినాను.
అక్కడ సుఖముగా పండుకొని నిద్రపోతున్న పెంపుడు
కుక్కతోకను పట్టుకొని గట్టిగా లాగుతున్నాడు.
కుక్కకు కోపము వచ్చింది. జంతువుకుమాత్రము కోప
ము రాదా? ఒకరిజోలికి పోకుండా మూల నిద్రపోతు
న్నాగదా, నన్ను బాధపెట్టడము మనుష్యస్వభావము
కాబోలు! వీళ్ళు నిద్రపోతూ ఉంటే వీళ్ళ కాళ్ళూ
చేతులూ పట్టుకొని ఎప్పుడైనా నేను లాగినానా? అను
కొన్నది కాబోలు కుక్క. తరవాత లేచి కుక్క కో
రలు చూపింది. 'ఇంతటి ఆయుధము నావద్ద వుంటే
నాదగ్గిరికి రావడానికి నీ వెలాగు సాహసించావు?' అని
కుక్కభాషలో అడగడము కాబోలది. కోరలు చూప
డమేకాక గుర్రు మన్నది కుక్క. కుర్రవాడు మళ్ళీ
కెవ్వున కేకవేసి ఏడ్చినాడు. వాడిని ఎత్తుకొని గదిలోకి

వచ్చి తలుపు వేసి, కింద కూర్చోబెట్టినాను. నా చదువుకు ఆటంకము కలుగకుండా ఉండేటందుకు వాడిచేతులలో బిస్కట్టు పెట్టి, ఆటవస్తువులు మళ్ళీ వాడిముందర పడవేసి నేను పడకకుర్చీ చేరినాను. మా వాడు బిస్కట్టుకొరుకుతూ మిగిలిన ముక్క చేతితో పట్టుకొని గిర్రున తిరుగుతూ, చెయ్యిచాపి ఆడుతూ సంతోషిస్తూ ఉన్నాడు.

నేను నవల తెరిచి విడిచినపట్టునుంచి చదవడానికి ఆరంభించినాను. కొన్ని సంవత్సరాలకింద నాయిక ఈవీరునితో బాసచేసిందట. బాసచేసిన రీతికిన్ని, ఈనాటి ఆమె ప్రవర్తనకున్నూ ఉన్న వ్యత్యాసము అతను గ్రహించలేక పోయినాడు! అంతట నాయిక మాట్లాడ నారంభించినది. ఆమె కళ్ళవెంట బాష్పాలు రాలుతున్నవి. ఆయన యుద్ధాలకు వెళ్ళి పరాక్రమముతో పోట్లాడినట్లున్నూ, చివరకు వీరస్వర్గానికి వెళ్ళినట్లున్నూ విన్నదట. ఎవరో గిట్టనివాళ్ళు చెప్పి ఉంటారు. ఆ సమాచారము వినకపోతే తన ప్రాణము ఉన్నంతవరకూ ఆయననే నమ్మి ఉండేదట. ఇంతలో నాయకుడు గొంతు సవరించుకొని నాయికకూ వీరునికీ మధ్య నిలబడి ఇలాగన్నాడు: "ఈవిషయములో ఎవరి ప్రవర్తన చెడ్డదయినా దోషము నాదే. మొదటినుంచీ నాయిక-" ఈమా

టలు చదువుతూ ఉండేటప్పటికి నాబుద్ధి కథమీదికి వెళ్ళక, పరధ్యానములో పడ్డది. పేజీలు తిప్పుతూ చదువుతునే ఉన్నాను, కాని కథమాత్రం గ్రహించడము లేదు. ఈకాలపు నవలలనుగురించి ఆలోచన కలిగింది. నాయకుడు నాయిక ఎక్కడో తారసిల్లడము, పరస్పరము ప్రేమ, తరువాత వారికి కష్టాలు, విరహము, చివరకు పెళ్ళి— ఈవిధముగా పూర్తిఅయ్యే మననవలల సంగతి జ్ఞప్తికివచ్చి, ఏమేమో ఆలోచనలు కలుగుతుంటే హఠాత్తుగా చప్పుడు వినిపించింది. అంతట ఏమి టా చప్పు డని వెనకకు తిరిగి చూస్తిని. మావాడు గోడ దగ్గరపెట్టెమీది కెక్కి, గోడకు తగిలించిన అల్మారులో నుంచి పుస్తకాలు కిందికి లాగి పడవేసినాడు. దాని చప్పుడు.

ఇంతలోనే వాడు సిరాబుడ్డి తీసి తలకిందుగా పట్టుకొని తనమీదా, పుస్తకాలమీదా, పెట్టెమీదా సిరా పారబోసినాడు. ఖరీదు గలపుస్తకాలు ధ్వంసముచేస్తున్నాడని—ఇదివరకు కొన్ని చించివేసినాడు—పట్టరానంత కోపము వచ్చి గూబ కదలవేయడానికి కుర్చీలోనుంచి లేచేటప్పటికి చేతిలో ఉన్నసిరాబుడ్డి నామీదికి విసిరి, 'నాన్నాన్న, నాన్నాన్న' అన్నాడు. నాబట్టలనిండా సిరాచుక్కలు పడ్డవి. 'ఎంతఅల్లరి చేస్తున్నావు! రావ

గా అల్లరి! 'అన్నా!' అని నే నంటే కుర్రవాడు నా వైపు తిరిగి 'అన్నా!' అన్నాడు. నాకోపము ఎగిరిపోయింది. సిరా అంటిన వాడిబుగ్గ ముద్దుపెట్టుకొన్నాను. ముద్దుపెట్టుకొంటుంటే వాడు సిరాచేతులు నాముఖాన పూసినాడు. ముఖము పైకెత్తి గుమ్మముకేసి చూతును గదా అసిస్టెంటు పోలీసు సూపరింటెండెంటుగారు అక్కడ నిలుచునివున్నారు!

## ౨

నేను ఉద్యోగములో ప్రవేశించిందిమొదలు నేటి వరకూ అధికారులమెప్పుదల పొందుతూ ఉన్నాను. ఎందరో అధికారులు వచ్చినారు, వెళ్లినారు. అందరూ నన్ను ప్రీతితో చూచేవారు. కిట్టనివాళ్ళు నన్నుగురించి అనేకవిధాలుగా చెప్పుకొంటారు. ఎవ్వ రేమి అనుకొన్నా నాకేమీ లోటు లేదు. వంగి వంగి సలాములు చేస్తూ నేను అధికారులవెంట తిరుగుతానట. పెద్దమనుషులను మర్యాదచేయడము వంగి వంగి సలాములు చెయ్యడమూ? నే నేమో బిరుదులు ఆశిస్తూ, ఉన్నద బ్బంతా అధికారులకోసము ఖర్చుపెట్టుతూ, స్వాతంత్ర్యము లేనివాడ నని బంధువులూ, స్నేహి

తులా దెప్పిపొడవడము న్యాయము కాదు. నిజము ఎదుటివారికి తెలియదు.

ఏమయినా సరే అని కొత్తగా వచ్చిన పోలీసు దొరను కాఫీ పుచ్చుకొనడానికి మాయింటికి ఆహ్వానము చేశాను. తెల్లవాళ్ళు మాయింటికి స్నేహభావముతో రావడము చూసి నాబ్రాహ్మణ్యము పాడయిపోయినదని చుట్టుపక్కలవాళ్ళు అనుకొనేవాళ్ళు. అయితే నేను వాళ్ళను లక్ష్యము చేసేవాడను కాను.

ఎనిమిదిగంటలకు ఆయన వస్తాడని నేను కనిపెట్టుకొని వుండి, ఊరికే కూర్చోకుండా నవల చదువుతూ ఉంటిని. మావాళ్ళు లోపల కాఫీ కాస్తూఉంటే కుర్రవాడు తల్లిదగ్గర ఉండక నాదగ్గిరికి వచ్చినాడు. పోనీ అని ఊరుకొన్నాను. పుట్టక పుట్టక పుట్టిన పిల్లవాడు కావడముచేత తల్లీ నేనూ వాణ్ణి ఎంతో గారాబంగా చూస్తూ ఉంటాము. వాడు చేసేఅల్లరికి మితి లేదు. చెప్పగూడదు గాని వాడిఅల్లరిమూలానే నాకూ వాడి తల్లికీ రెండుమూడుసార్లు జగడము సంభవించింది. జగడము లేనియిల్లు వున్నదా? ఈక్షణము భార్యతో దెబ్బలాడి పరక్షణము మళ్ళీ మాట్లాడనివా రెవరు? కాని నేనుమాత్రము దెబ్బలాడిన తరువాత రెండుమూడు రోజులదాకా మాట్లాడేవాడను కాను.

ఒకనాడు నేను పుస్తకము చదువుతూ ఉంటే మా వాడు గదిలోకి వచ్చినాడు. నేను చదివేవేళా, వాడు అల్లరిచేసేవేళా సామాన్యముగా ఒకటే. నేను చదువుతూఉంటే వాడు దగ్గిరికి వచ్చి చదువన పుస్తకము లాగితే కొన్ని కాకితాలు చినిగినవి. నాకు చాలాకోపము వచ్చినది. అటుమీద వాణ్ని తల్లిదగ్గిరికి ఈడ్చుకు పోయినాను. తల్లికూడా వాణ్ని రెండు తిట్టింది. మళ్ళీ గదిలోకి వెళ్ళినతరువాత నాకు పశ్చాత్తాపము కలిగింది. ఇంతలో కుర్రవాడు గదిలోకి వచ్చి నాచెయ్యి పట్టుకొని ఇంట్లోకి లాగుకొని పోయినాడు. ఎందుకో అనుకొన్నాను. వాడు తనతల్లిచెయ్యి రెండోచేత్తో పట్టుకొని మాయిద్దరిచేతులూ కలిపినాడు. మూడేళ్లపిల్లవాడు ఇటువంటిపని చేయడము ఇతరులకు నమ్మశక్యము కాని దైనా, వింతగా కనిపించినా, మాకుమాత్రము సంతోషము కలిగించింది. కలహాలు కల్పించడానికి చేతులు కలపడానికీ తగినవాడ వయినావా అనుకొని ఇద్దరమూ వాణ్ని చూసి నవ్వినాము.

దొరకోసము ఎదురు చూస్తూ, నవల చదువుకొంటూ ఉంటిని. మావాడు అల్లరిచెయ్యడమూ, నేను సద్దడమూ వీటితో కొంత కాలక్షేపము అయింది. ఇంతలో దొర వచ్చి, గుమ్మముదగ్గర నిలవబడినాడు. నాబట్టల

నిండా సిరా, ముఖమునిండా సిరా, చేతిలో పిల్లవాడు! ఇటువంటి వికారపు వేషముతో ఆయనకు కనబడ్డాను గదా అని చిన్నబోయినాను. అందులో ఆ పెద్దమనిషి మనవాడైనా కాదు, తెల్లదొర!

దొర గుమ్మము దగ్గిర నిలుచుని చిరునవ్వు నవ్వినాడు. ఇం కేమున్నది! నా మోటతనము చూచి ఆయన నవ్వినా డనుకొన్నాను. మనఃపూర్వకంగా క్షమాపణ చెప్పుదా మనుకొన్నాను. నోరు తెరవబోయ్యేటప్పటికి 'మీపిల్లవాడా?' అని దొర అన్నాడు. 'కాదు!' అని చెప్పదలచుకొన్నాను. నాకొడుకు ఇలాటి అవకతవక పనులు చేస్తాడని అనుకొని పోతాడని కాదు అనబోతిని. నాలికచివరకుకూడా వచ్చింది. అయితే ఇతరులపిల్లవాడు నాగదిలో ఇంతల్లరి చేయడానికి నేను సహిస్తానా! అంతమాత్రం దొర గ్రహించలేడా అని ఆలోచించి, ముందు క్షమాపణ చెప్పి, నాపిల్లవాడే అనక తీరింది కాదు. ఎంతో నొచ్చుకొని, మిక్కిలి దీనముగా జవాబు చెప్పినాను. దొర మళ్ళీ నవ్వి 'అల్లరి పిల్లవాడు లాగు వున్నాడే!' అన్నాడు. ఇం కేమున్నది! అన్నందాలా బిడియమే అనుకొని, ఆయన కేమి జవాబిత్తునా అని ఆలోచించినాను. అల్లరి పిల్లవాడే అంటే హిందువులు పశువులనుకొంటాడేమో, నన్నే మనుకొంటాడో.

కాం డంటే అల్లరి చేసినట్లు కనిపిస్తున్నదే! 'చిత్తము, క్షమించండి. అల్లరి పిల్లవాడే' అంటిని. అన్నప్పుడు నీతిచంద్రికలో మాట జ్ఞాపకము వచ్చింది. 'గంపెడు గులకరాళ్ళకంటె ఒక్క మాణిక్యము చాలు'నని. ఇస్తూ ఇస్తూ భగవంతుడు ఈగులకరాయే నాకియ్యవలెనా? అనుకొన్నాను. దొర విసుగుకొని మొగము చిట్లించుకొని వెళ్ళిపోతాడేమో అని భయము వేసింది. కాని ఆయన నెమ్మదిగా నాకొడుకు దగ్గిరికి వచ్చి, వేలితో వాడిబుగ్గమీద నవ్వుతూ కొట్టినాడు. ఆమాత్రము చనువు ఇచ్చిందే చాలు నని కాబోలు మావాడు దొర మెడలోపట్టీ (టై) పట్టుకొని గట్టిగా లాగివేసినాడు. నేను చాలా సిగ్గుపడ్డాను. దొరకు కోపము రాలేదు. పైగా ఆయన కుర్రవాడిని ముద్దాడినాడు. ఈయనకు మతి పోయిందా అనుకొన్నాను. తర్వాత ఆయన మావాడిచేతిలో పదిరూపాయలనోటు పెట్టి, కుర్చీలో కూచుని, 'చక్కని కొడుకు! అదృష్టవంతులు మీరు!' అన్నాడు. సమయము దొరికిందే చాలునని మావాడి గుణాలన్నీ ఆయనయెదుట ఏకరువు పెట్టినాను. చుట్టుపక్కల ఉన్నపిల్లవాళ్లకంటె మావాడు చక్కనివాడు, బుద్ధిమంతుడు—ఏమి కాడు! అన్నీ గబగబా చెప్పినాను. దొర నామాటలకు నవ్వినాడు.

“నాకూ ముగ్గురు పిల్లలున్నారు. వాళ్లూ ఇలాగే అల్లరి చేస్తారు” అని దొర అన్నాడు. ఏమిటి! దొరల పిల్లలుకూడా అల్లరి చేస్తారా! అల్లరి చేయడము అనాగరికుల లక్షణము కాదా?

“చురుకుగా అల్లరిచేసేపిల్లలను చూస్తే నా కిష్టము” అన్నాడు దొర. మా అబ్బాయి మరింత అల్లరి చేస్తే బాగుండును అనుకొంటిని. దొరకు కాఫీవేళ దాటిపోతున్నదని నేను మొగమూ చేతులూ కడుగుకొని మంచి బట్టలు వేసుకొని రావడానికి ఆయనను సెలవు అడిగితే వద్దని ఆయన నన్ను కూర్చోబెట్టి తనబిడ్డలసంగతి చెప్ప నారంభించినాడు. మావాడు ఊరుకోక దొర వొళ్లో కూర్చున్నాడు. చాలాసేపు ఇష్టాగోష్ఠి జరిగింది. కాఫీ తాగి దొర వెళ్ళబోతూ ఉంటే, ఆయనదుస్తులకు మావాడు సిరాచేతులు రాచినందుకు క్షమాపణ చెప్పబోతిని.

“ఫరవాలేదు! కుర్రవాడి చేతినుంచి సిరా నాకోటుమీదికి వచ్చినందుకు గర్వపడుతున్నాను!” అని దొర వెళ్ళిపోయినాడు.

ఇంటిలోకి వెళ్ళి నేను ఈసంగతులు మావాడితల్లితో చెప్పినాను. ఇద్దరమూ ఇంతసేపు నవ్వుకొన్నాము.